


# మరో అడుగు

## - డా.వేదుల సుభద్ర



(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

"ఎన్.జీ.వోలు, ట్రస్టులు, క్రౌడ్ ఫండింగ్ లా? అంటే?" అడగకుండా రోహిణిని ఎవ్వరూ ఆపలేకపోయారు.

'ముందు డాక్టర్ ని మాట్లాడనిస్తావా? ఎన్ని సార్లు చెప్పినా అర్థం కాదా?' అన్నట్టుగా కొద్దిగా కోపంగా చూశాడు శేఖర్ ఆమెవైపు.

ఆమె అతన్ని పట్టించుకోనట్టుగా " చెప్పండి డాక్టర్? మీరన్న మాటలకి అర్థమేమిటి?" అంది

ఆమెకి అర్థం అవ్వాలని చిన్నగా ఆమె భుజాన్ని గిల్లాడు.

" ఏమైంది? ఏదైనా తప్పుగా మాట్లాడానా? ఏం రాధికా? నువ్వు చెప్పు." అంటున్న ఆమెని ఎలా ఆపాలో తెలియక వెర్రి చూపులు చూస్తున్న శేఖర్ ని చూసి నవ్వుతూ.

" పరవాలేదు లెండి శేఖర్! అడగనివ్వండి" అన్నాడు నెమ్మదిగా.

"అమ్మయ్య! మీరలా అని నా నెత్తిన పాలు పోశారు డాక్టర్. లేదంటే నాకుండేది ఇంటికెళ్ళాకా" అంది గుండెల మీద చెయ్యి వేసుకుంటూ.

చిన్నపిల్లలా, నిర్మలంగా మాట్లాడుతున్న ఆమెని చూసి మళ్ళీ నవ్వాడు డాక్టర్ రాజేష్.

ఆమె వైపే ప్రత్యేకంగా చూస్తూ చెప్పడం మొదలుపెట్టాడు

" చూడండి రోహిణి గారు. ఎన్.జీ.ఓలు అంటే మీకు తెలుసు కదా, ప్రజల క్షేమం కోరుకునే ప్రభుత్వేతర సంస్థలు.

అలాగే ట్రస్ట్ లు కూడా.

వాటిని ఒకరు లేదా ఒక టీముగా ఏర్పడే వ్యక్తులు లేదా ఫౌండేషన్ గా ఏర్పడి తమకి బాగా ఇష్టమైన లేదా వారి మనసుకు దగ్గరైన విషయాలకి సంబంధించిన ఛారిటీ పనులు చేస్తారని మనకి తెలిసినదే కదా.

ఆడపిల్లల చదువులు, స్కాలర్షిప్ లు, విద్యార్థులకి కొత్త విషయాలు నేర్పించడం లాంటివెన్నో అంశాలని వాళ్ళు ఎంచుకుంటారు.

వాటిల్లో కొందరు ప్రజల ఆరోగ్య సమస్యలను కూడా ఎంచుకుంటారు.

పిల్లల గుండె జబ్బులకి సహాయం అందించే సంస్థలు, కేన్సర్ ఫౌండేషన్ లు ఇలాంటివి. ఇవి పెద్ద పెద్ద సెలెబ్రిటీలు కూడా చేస్తూ ఉంటారు అని మీకు కూడాతెలుసు కదా" అంటూ ఆగారు రోహిణి వైపు చూస్తూ.

" అవును, అవును, తెలుసు. ఐతే?" అందావిడ సందేహంగా.

" అలాంటి సంస్థలగురించి తెలుసుకుని, వారిని మనకి సహాయం చెయ్యమని అభ్యర్థించడం ఒక మార్గం."

"అలా మనం అడగ్గానే చేస్తారా? " అనుమానంగా అడిగింది రోహిణి

"మంచి ప్రశ్న.

మనం అడగ్గానే వాళ్ళు సహాయం చేసేస్తారని అనడం లేదు.

వారికి ఇలాంటి రిక్వెస్ట్ లు చాలా వస్తూ ఉంటాయి. మనలాంటి వాళ్ళు చాలా మంది ఉంటారు వాళ్ళ లిస్ట్ లో.

అందులో ఎవరిని వాళ్ళని ఎంపిక చేసుకుంటారో చెప్పలేం. చెప్పవలసిన అవసరం కూడా వాళ్ళకి ఉండదు.

అందుకే వారు మనకే సహాయం చేస్తారని ఖచ్చితంగా చెప్పలేం.

వారికి ఆ సంవత్సరానికున్న బడ్జెట్ ని బట్టి, అడిగే వారి అవసరాన్ని బట్టి సహాయం చేస్తారు.

ట్రస్ట్ ల గురించి కూడా చెప్పాను కదా, అవి కూడా దాదాపు ఎన్.జీ.వోల్లాగే పనిచేస్తాయి.

సహాయం కోరుకునే వారి సంఖ్య కూడా పెద్దదే ఉంటుంది, ఉన్న ఆరోగ్య సమస్యలకి అయ్యే ట్రీట్మెంట్ ఖర్చులు కూడా చాలా ఎక్కువే ఉంటాయి కనక ఆ సంస్థలు కూడా బాగా ఆచి, తూచి వ్యవహరిస్తాయి. "

అందరూ ఆయన చెప్పేది శ్రద్ధగా వింటున్నారు.

“అందువల్లే క్రౌడ్ ఫండింగ్ కి కూడా వెళ్ళడం మంచిదేమో అనిపిస్తోంది నాకు.” అన్నారు డా.రాజేష్.

" క్రౌడ్ ఫండింగా? అంటే?" ఈ సారి రాధిక అడిగింది.

క్రౌడ్ ఫండింగ్ అంటే ఏమిటో? వివిధ కారణాలకి ప్రపంచవ్యాప్తంగా ఎన్ని రంగాల్లో దాన్ని ఉపయోగిస్తున్నారో? వివరించి చెప్పాడు.

“పాత కాలంలో అయితే న్యూస్ పేపర్ల లోనూ, ఆపైన టీవీల్లోనూ, ఈ మధ్య కాలంలో సోషల్ మీడియా వేదికల్లోనూ తమకున్న సమస్యను వివ్వరిస్తూ, ప్రజలని సహాయం అర్ధిస్తూ ప్రకటనలు చేస్తారు.

సహాయం చెయ్యదల్చుకున్నవారు తమకిష్టమైనంత మొత్తాన్ని అడిగిన వారికి నేరుగా ఇవ్వడం కానీ, బాంక్ ట్రాన్స్ఫర్ చెయ్యడం గాని చేస్తారు.

ఇలాంటి వాటి మీద టాక్స్ రాయితీలు కూడా ఉంటాయి.

విదేశాల్లో ఐతే ' గో ఫండ్ మీ' లాంటి సంస్థలు కూడా ఉంటాయి. అలాంటివే చాలా సంస్థలు మన దేశంలోనూ కూడా ఉన్నాయి. వాటికి ఇవ్వవలసిన కమీషన్ లు వద్దనుకుంటే మనకే నేరుగా డబ్బు వచ్చేలా కూడా చూసుకోవచ్చు.

‘దయతోనూ మానవత్వంతోనూ చేసే పని ఎంత చిన్నదైనా సరే వృధాకాదు!’ అని ఇంగ్లీష్ లో ఒక నానుడి ఉంది.

అలాగే చినుకు చినుకు కలిస్తే మహాసముద్రమౌతుందన్నట్టు ఇలా వచ్చేవి మనకి చాలా ఉపయోగపడతాయి.

మీరు ఇంతకు ముందు చెప్పిన సేవింగ్స్, ఈ క్రౌడ్ ఫండింగ్ వల్ల వచ్చిన డబ్బు ముందు మీకు చాలా అవసరం.

మనం ఈలోపు ఎన్.జీ.వోలు, ట్రస్ట్ లని కలిసి, వారి సహాయాన్ని కూడా అర్థిద్దాం. ఇవన్నీ కలిపి మన స్వప్నిక ని ఈ ఆపదలోంచి బయటపడేస్తాయని నా నమ్మకం.

నేను, స్నేహ కూడా ఈ విషయంలో మాకు వీలైనంత సహాయం చేస్తాం, అది మా మాట, స్వప్ని మీద మాకున్న ప్రేమ" అన్నాడు ఆయన కాస్త ఎమోషనల్ గా.

" అయ్యో, ఇంకానయం డాక్టర్. మాకోసం మీరిద్దరూ ఇంత సమయం వెచ్చిస్తున్నారు. అదే పదివేలు. ఇంకా డబ్బు సహాయం కూడానా?" అంది రాధిక.

" అవును డాక్టర్ రాజేష్! రాధిక అన్నది నిజం. పేషెంట్ల పట్ల ఇంత ప్రేమతో ఉంటారు, కావలసిన సలహాలు, ట్రీట్మెంట్ లు, అప్పుడప్పుడు ఉచితంగా మందులు ఇలాంటివన్నీ ఇస్తారు. ఇంతకంటే ఏం చేస్తారు? చెయ్యగలరు?" అన్నాడు కిరణ్ కూడా.

" అందరికీ ఇవ్వము, ఇవ్వలేము కదా.

స్వప్ని విషయం వేరు.

మనం అనుకున్నట్టుగా అన్ని అమరితే సరే! లేదంటే మేము కూడా ఉన్నాము, ఉంటాము అని చెప్పడానికే అలా అన్నాను" అంటూ మళ్ళీ క్రౌడ్ ఫండింగ్ గురించి మరిన్ని వివరాలు చెప్పాడు.

ఆయన ఎన్ని చెప్పినా క్రౌడ్ ఫండింగ్ విషయం రాధిక, కిరణ్ ఒప్పుకోలేకపోయారు. అయితే ఆయన మీదున్న గౌరవంతో ఆ మాట నేరుగా చెప్పలేకాపోయారు. ముందుగా కిరణే అన్నాడు

" మా ఆర్థిక పరిస్థితి గొప్పగా లేని మాట నిజమే, కానీ మరీ మా అమ్మాయి ట్రీట్ మెంట్ కి మీరందరూ తలా కాస్త ఇవ్వండి! అంటూ అడగడం ఏం బావుంటుంది?"

“అవును కదా డాక్టర్!” అంది రాధిక కూడా తనకే వినబడనంత నెమ్మదిగా.

తాము అంటున్న మాటలు పూర్తి కాకముందే, తమకింకేమీ ఇతర మార్గాలు లేవని అర్థం అయింది వాళ్ళిద్దరికి అప్పటికే.

" ఇదేదో పరువ తక్కువ పని అనో, ఇలా అడగడం చిన్నతనమనో భావించక్కర్లేదు. ఎంతో ధనవంతులైన వారికైనా ఒక్కరికే ఇచ్చే పరిస్థితి ఉండకపోవచ్చు, ఉన్నా ఇచ్చేంత పెద్ద మనసు కూడా ఉండకపోవచ్చు.

అదే మాములు మధ్యతరగతి వాళ్ళైనా తమకి వీలున్నంత మొత్తం ఇచ్చే సదుపాయం ఉండడం వల్ల ఇది తేలిగ్గా అనిపిస్తుంది. నేను ముందే చెప్పినట్టు ఒక్కో చుక్కా కలిపి మహా సాగరం అవుతుంది.

సాగరమైనా, కాకపోయినా స్వప్నిక ట్రీట్ మెంట్ కి కావలసినంత లేదా వీలైనంత ఎక్కువ సహాయం అందడం మనకి ముఖ్యం.

అది చేరుకోవడానికి మనకున్న అతి ముఖ్యమైన మార్గాలని వెతకడమే మనం చేస్తున్న పని.

దురదృష్టవశాత్తు మనలో ఏ ఒక్కరం కూడా ఆ సమస్యని చిటికెలో తీర్చగలగేంత ధనవంతులం కాదు కదా. అందుకే స్నేహ చెప్పిన సలహా ఇది. నాకు కూడా బాగా నచ్చింది.

అన్ని వైపులా బాణాలేస్తేనే కనీసం ఏదో ఒకటి తగులుతుంది.

అందుకే మాకు తెలిసిన ట్రస్ట్ లు, ఎన్.జీవోలు అన్నింటి గురించి విచారిస్తున్నాము.

దానికి తోడు ఇది కూడా ఫలిస్తే మనకి కొంత ఊరట లభిస్తుంది" అన్నాడాయన, కళ్ళజోడు తీసి తుడుచుకుంటూ.

స్వప్నిక ని ఒక మాములు పేషెంట్ గా కాక, ఎంతో కావలసిన, తమ కుటుంబంలో పిల్లలా భావిస్తూ తమకెంతో ఆప్తులైన ఆ డాక్టర్లిద్దరిపట్లా అంతులేని కృతజ్ఞతతో ఆ నలుగురి మనసులూ నిండిపోయాయి.

అయితే ఆయన చెప్పిన మాటల్లోని ఉపయోగాన్ని ముందుగా గుర్తు పట్టిన కిరణ్ సాలోచనగా తలూపాడు ఆయన మాటలకి.

" స్వప్నిక వివరాలు గోప్యంగా ఉంచుదాం, అందరికీ తన పేరు, ఇతర వివరాలు తెలియవలసిన అవసరం లేదు.

చిన్నపిల్ల, కాబోయే పెద్ద అథ్లీట్. తన వివరాలు ఇమతకంటే పబ్లిక్ కి తెలియడం మంచిది కాదు.

'నా పేషెంట్లలో ఒకరికి సహాయం కావాలని, అతి తక్కువ వివరాలు తెలుపుతూ నేను ఒక ప్రకటన తయారు చేస్తాను.

డాక్టర్ దగ్గరనించి వస్తే కాస్త విలువ ఎక్కువిస్తారేమో అని ఒక చిన్న ఆశ. ఇది కూడా స్నేహ సలహాయే.

ఫండ్స్ పంపడానికి నా బాంక్ అకవుంటే ఇస్తాను, దానివల్ల మీ ఎవరి వివరాలు కూడా బయటపడవు.

పాపకి ప్రైవసీ ఎంతో ముఖ్యం.'

ప్రస్తుతానికి తన మందులకయ్యే ఖర్చులు నేనూ, స్నేహా చూసుకుంటాం. దురదృష్టవశాత్తూ మాకున్న కుటుంబ బాధ్యతల వల్ల ఇంతకంటే ఎక్కువగా ఏమీ చెయ్యలేకపోతున్నాం " అన్నారాయన బాధతో.

ఆయన ఆ మాటనగానే రాధిక అప్రయత్నంగానే రెండు చేతులూ జోడించింది.

కిరణ్ కూడా చెమర్చిన కళ్ళతో ఆయన చేతులు పట్టుకున్నాడు.

" స్వప్ని పట్ల మీఇద్దరికీ ఉన్న ప్రేమ మాకు తెలుసు డాక్టర్. అందువల్ల మీరు దయచేసి ఇలా మాట్లాడవద్దు. 'ఇంతకన్నా ఏమీ చెయ్యలేము!' అన్న మీ మాట అస్సలు కరక్ట్ కాదు. ఇప్పటికే మీరిద్దరూ చేస్తున్న సహాయానికి మేము వెలకట్టగ్లమా? ప్రతిఫలంగా ఏమైనా తిరిగి ఇవ్వాలేమా? ఆజన్మాంతం మీ ఇద్దరికీ ఋణపడి ఉండడం తప్ప.

అందుకని దయచేసి "ఇంతకన్నా ఏమీ చెయ్యలేము, చెయ్యలేకపోతున్నాం" లాంటి మాటలు అనకండి ప్లీజ్" అన్నాడు.

కిరణ్ రాజేష్ తో ఆ మాటలు చెప్తున్నంతసేపూ జోడించిన చేతులతో రాధిక తల ఊపుతూ తన సమ్మతిని తెలియచేస్తూనే ఉంది.

దు:ఖంతో పూడుకుపోయిన గొంతు వల్ల మాటలు రావడంలేదామెకి.

ఆఖరుకి గొంతు పెగుల్చుకుని " ఆయన చెప్పింది నిజం డాక్టర్. ఈ నిమిషాన మీకన్నా ఆప్తులు గానీ, దైవ సమానులు గానీ మాకు లేరు. ఈ మాట నా గుండెల్లోంచి వచ్చినది. ఎంతో గొప్ప స్నేహితులు మీరు." అంది డగ్గుత్తికతో.

"నేను చెప్పినట్టుగా నా సర్కిల్ లో ఉన్న డాక్టర్ల స్నేహితులద్వారా తెలిసిన ట్రస్ట్ లు, స్పాన్సర్స్ లతో మాట్లాడుతాను.

ప్రపంచం లో ఇంకా మానవత్వం బ్రతికుందనీ, అది పచ్చగా పెరిగి చిగుర్లు తొడిగి విస్తరిస్తుందని నమ్మకం.

' సీక్రెట్ ' అనే ప్రముఖ పుస్తకంలో ఒక మాట ఉంటుంది ' పాజిటివ్ ఎప్పుడూ పాజిటివ్ ని ఎట్రాక్ట్ చేస్తుందీ అని.

అందుకని మనమందరం వీలైనంత పాజిటివ్ గా ఉందాం.

మనం మన స్వప్నిక కోసం గొప్పవైన కలలు కందాం, కలిసి తన కలని నెరవేరుద్దాం.

ఆ పాప పరిగెత్తే ప్రతీ పందెంలోనూ ముందుండడానికి, ముందంజ వెయ్యడానికి మన వంతు సహాయం చేద్దాం." అన్నారాయన

ఈ పరుగు వచ్చే నెలదాకా

Post your comments